క్లుప్తంగా

బంగారం, నగదు చోరీ



ఐనవోలు: మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన కొంకటి కుమారస్వామి ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొంకటి కుమారస్వామి, కుటుంబ సభ్యులు వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి చెలుక వద్దకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి రాగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళంతో పాటు బీరువా తాళం పగులకొట్టినట్లు గుర్తించారు. బీరువాలో ఏడు తులాల బంగారం, రూ.30 వేల నగదు చోరీ అయినట్లు కుమారస్వామి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై నవీన్‌కుమార్ క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

క్షేత్ర ప్రదర్శన

శాయంపేట : మండలంలోని సూరంపేట, గట్లకానిపర్తి, తహరాపూర్ గ్రామాలల్లో పంట క్షేత్రాలను గురువారం కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ రాజు, డాక్టర్ సౌమ్యలు వ్యవసాయ అధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్తి ఎదుగుదలకు కాంప్లెక్స్ ఎరువులు 19 19 19 వాడాలని సూచించారు. వారి వెంట ఏఓ గంగాజమున, ఏఈవో రాకేష్ తదితరులు ఉన్నారు.

దేవేందర్‌కు పితృవియోగం

ఐనవోలు: మండలంలోని ముల్కలగూడెం గ్రామానికి చెందిన జిల్లా ఆత్మకమిటీ డైరెక్టర్ కుసుంబ దేవేందర్ తండ్రి కుసుంబ వీరయ్య అనారోగ్యంలో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి. వీరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేవేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

గోడను కూల్చివేయండి

ఐనవోలు: మండలంలోని పున్నేలు గ్రామంలోని బాబాయికుంట(తురుకోనికుంట) చెరువు కట్టకు ఆనుకోని బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ కాంపౌండ్‌ను తొలగించాలని ఇరిగేషన్ శాఖ డీఈ శంకర్ మండల పంచాయతీ అధికారి రఘుపతిరెడ్డికి గురువారం లేఖ రాశారు. బాబాయికుంట(తురుకోనికుంట) చెరువుకు 37 ఎకరాల ఆయకట్టు ఉందని, అక్రమ నిర్మాణ దారులకు మే 20 వ తేదీన నోటీస్ ఇచ్చినట్లు లేఖలో పేర్కొన్నారు. జూలై 18వ తేదీన రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్‌శాఖ, మైనింగ్ శాఖల సంయుక్త తనిఖీలో జీఓ 168, 105ల ప్రకారం బాబాయికుంట చెరువుకు బఫర్‌జోన్ మార్కింగ్ చేసినట్లు తెలిపారు. కాగా చెరువు కట్ట మత్తడిని ఆనుకుని నిర్మించిన కాంపౌండ్ వాల్ బఫర్ జోన్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎలాంటి అనుమతి పొందలేదని పేర్కొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

పరకాల: ఓపెన్ స్కూల్ విద్యాను సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ మురాల శంకర్ రావు కోరారు. ఈ మేరకు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్ పోస్టర్‌ను గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొండబత్తిని సంపత్‌కుమార్, ఓపెన్ స్కూల్ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ రవీందర్, సుధీర్, ఎన్ఎస్ఎస్ అధికారి సర్దార్, రామకృష్ణ, స్వాత్విక్, సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదగాలి



దామెర: స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని పురుషులతో సమానంగా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ మహ్మద్ ఖాజా మసియొద్దీన్ కోరారు. మండల కేంద్రంలో 3 నెలలు నుంచి జూట్ బ్యాగుల తయారీ, కుట్టు మిషన్‌పై శిక్షణ కార్యక్రమం కొనసాగించగా గురువారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. మహిళలు తయారుచేసిన వస్తువులు ప్రదర్శించారు. అనంతరం శిక్షణపై తమ అభిప్రాయాలను, అనుభవాలను పంచుకున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పరకాల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా స్థానిక పోలీస్‌లు స్వాధీనం చేసుకొని బాధితుడికి అందించారు. పట్టణానికి చెందిన పసుల తిరుపతి కొన్ని రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు సీఈఐఆర్ అప్లికేషన్‌లో నమోదు చేసుకోగా సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు లోకేషన్ ఐడెంటీఫై చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాధితుడికి సీఐ వెంకటరత్నం గురువారం అందించారు.



ఎల్కతుర్తి : గురుకుల పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైద్యులు



శాయంపేటలో..



ఆత్మకూరులో..



ఐనవోలులో..



దామెరలో..

నులి పురుగులను నివారిద్దాం..

ఎల్కతుర్తి: పిల్లల ఎదుగుదలకు అడ్డుపడే నులిపురుగులను నివారించాలని ఎంపీపీ జక్కుల అనిత అన్నారు. నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ పీహెచ్‌సీ, వంగర పీహెచ్‌సీ, ఎల్కతుర్తి, గోపాల్‌పూర్ పీహెచ్‌సీల పరిధిలో గల ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు గురువారం అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ హాజరై మాట్లాడారు. నులిపురుగులతో విద్యార్థుల్లో పోషకాహార లోపం, రక్తహీనత, అలసట, నీరసంతో పాటు మందకొడిగా ఉంటారని అన్నారు. దీంతో పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతుందన్నారు. ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నులిపురుగులను మొదట్లోనే నివారించవచ్చని తెలిపారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల్లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని సూచించారు. ప్రతీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఇళ్లల్లో ఉండే పిల్లలకు సైతం మాత్రలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగ రవీందర్, ఎంఈవో వెంకటేశ్వర్‌రావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని వివిధ గ్రామాల్లో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారి సాయికృష్ణ గురువారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పత్తిపాక గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డిలు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: 19 ఏళ్ల లోపు పిల్లలు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో నట్టల నివారణ మాత్రలు వేశారు. తిరుమలగిరిలోని కేజీబీవీలో వైద్యాధికారి స్పందన మాత్రలు పంపిణీ చేశారు. కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వాసవి తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్‌లో..



నడికూడలో..



భీమదేవరపల్లిలో..

దామెర: నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కాగితాల శంకర్ సూచించారు. నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో గురువారం విద్యార్థులకు, పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ నులిపురుగులతో పిల్లల్లో రక్తహీనత ఏర్పడి ఆరోగ్యం క్షీణిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జంగం రాణి, సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, దళితబంధు మండల చైర్మన్ గరిగె కృష్ణమూర్తి, దుర్గంపేట్ ఎంపీటీసీ రాము, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్ఎం, అంగన్‌వాడీ సిబ్బంది, పాల్గొన్నారు.

ధర్మసాగర్: నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకుబ్ పాషా తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ళ వయస్సులోపు పిల్లలు మాత్రలు వేసుకోవాలని సూచించారు. మండలంలో మొత్తం 10,723 మంది పిల్లలు ఉండగా గురువారం ఒకేరోజు 10, 232 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 10వ తేదీన మరో 491 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్, ధర్మసాగర్ ఉప సర్పంచ్ బొడ్డు అరుణ, సీహెచ్ఓ మాధవరెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పరకాల: విద్యార్థికి నులిపురుగుల నివారణ మాత్రలు వేస్తున్న సివిల్ ఆస్పత్రి సిబ్బంది

నడికూడ: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను స్థానిక వైద్య సిబ్బంది గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య ఉపకేంద్రం మెడికల్ ఆఫీసర్ అనూహ్య, ఏఎన్ఎం విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఆశ వర్కర్లు సునీత, సుమలత అంగన్‌వాడీ టీచర్లు కళావతి, సంపూర్ణ, వినోద, ఆయాలు నరసమ్మ, మేరీ పాల్గొన్నారు.

ఐనవోలు: నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రలను స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది పంపిణీ చేశారు. నట్టల వలన రక్తహీనత, కడుపులో నొప్పి, నరాల బలహీనత ఏర్పడుతుందన్నారు.

పరకాల: 19 సంవత్సరాల విద్యార్థులందరూ నులిపురుగుల నివారణ మాత్రలు తప్పకుండా వేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోష్‌కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక సివిల్ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో నులిపురుగు మాత్రలు పంపిణీ చేశారు. 19 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు మాత్రలు వేసుకోవాలని సూచించారు. కళాశాల హెల్త్‌క్లబ్ ఇన్‌చార్జ్ డాక్టర్ సుభాషిణి, అధ్యాపకులు డాక్టర్ రాజయ్య, డాక్టర్ స్వప్న, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్‌లు ఓదేలు, నవీన్, ఇందిరాదేవి, అరుణ, కుమారస్వామి, అశోక్ రవికుమార్, అనిల్‌కుమార్, సుసిత్మ, సంజయ్, రాజు, రఫీ, శ్రీనివాస్, రాజు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదిరుతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు

శాయంపేట : మండలంలోని మాందారిపేట గ్రామ శివారులో పేకాడుతున్న ఐదుగురిని గురువారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. మాందారిపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు తెలిపారు. పేకాడుతున్న గుండెకారి శ్రీనివాస్, చందనాల సునీల్, బొట్ల సురేందర్, వలపదాసు చంద్రమౌళి, నిమ్మల నరేష్‌ను అదుపులోకి తీసుకోగా మరొకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 41వేల 260 నగదు, 2 బైకులు, 4 సెల్‌ఫోన్లు, పేకముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిరసనకు తరలి రావాలి

ఎల్కతుర్తి: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సాధారణ భవిష్య నిధి (జీపీఎఫ్) ఖాతాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన హనుమకొండ జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. జీపీఎఫ్ ఖాతాలపై ఉన్న ఆర్థిక ఆంక్షలను ప్రభుత్వం వెంటనే తొలగించి, పెండింగ్‌లో ఉన్న లోన్లు, పార్ట్ ఫైనల్స్, ఫైనల్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు బత్తిని శ్రీదేవి, నాయకులు దాస్యం శ్రీరామ్, పాలకుర్తి సదానందం, లక్ష్మణ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

శాయంపేట : విద్యార్థి సంఘాల నాయకులను, ప్రజా సంఘాల నాయకులను, మీడియాను విద్యా సంస్థల్లోకి అనుమతించొద్దని విద్యాశాఖ కమిషనర్ దేవసేన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల నాయకులకు అనుమతి లేదని వ్యాఖ్యానించడం సరైనది కాదన్నారు. చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు.

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్



కమలాపూర్ : సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సర్పంచ్ రాంచందర్‌రావు

రైతుల పక్షపాతి సీఎం కేసీఆర్ అని బీఆర్ఎస్ శ్రేణులు కొనియాడారు. రైతుల రుణాలను మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించి, సంబంధిత ప్రక్రియను ప్రారంభించాలని అధికారులను ఆదేశించిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ ప్రజాప్రతినిధులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. రైతులకు రైతుబీమా, రైతుబంధుతో పాటు రుణమాఫీ చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అని పలువురు ప్రశంసించారు. - సాక్షి నెట్‌వర్క్



శాయంపేటలో..



ఐనవోలులో..



పరకాలలో..



ఎల్కతుర్తిలో..



దామెరలో..



ధర్మసాగర్‌లో..

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



శాయంపేట : మాట్లాడుతున్న మంజుల



నడికూడలో..

శాయంపేట : పుట్టిన బిడ్డకు తల్లిపాలతోనే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. పత్తిపాక గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు పట్టించాలని, దీంతో బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.



దామెరలో..

నడకూడ: మండలంలోని ఇప్పలపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ అనిత మాట్లాడుతూ పుట్టినప్పుడే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. తల్లిపాలు పట్టించడం వలన తల్లికి అధిక రక్తపోటు, దీర్ఘకాల జబ్బుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ ఆయా సువర్ణ పాల్గొన్నారు.

దామెర: తల్లిపాలతోనే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని సింగరాజుపల్లి సర్పంచ్ ఉప్పుల రజిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు తాగించాలని సూచించారు. తల్లి పాలలో శిశువుకు కావలసినంత పోషకాలు ఉంటాయన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ వాణి, తల్లులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణమెప్పుడో?



మాట్లాడుతున్న నాయకులు

ఐనవోలు: పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నందనంలో నూతన పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేసి సంవత్సరం గడుస్తున్న ఇప్పటికీ నిర్మాణం పనులు ప్రారంభం కలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్ ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు యాకర సాంబయ్య, బండి సంపత్, దోమకొండ హరీష్‌లతో కలిసి ఆయన నందనం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ జెడ్పీ వైస్‌చైర్మన్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్జెల శ్రీరాములు స్వంత గ్రామంలో జీపీ బిల్డింగ్‌కు మంత్రి భూమిపూజ చేసినా నిర్మించే స్థితిలో అధికార పార్టీ లేకపోవడం సిగ్గుచేటన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తిరస్కరించడం ఖాయమని అన్నారు. ఇచ్చి హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జీపీ భనవ నిర్మాణం పనులు ప్రారంభం చేయని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

'తొలిమెట్టు'తో బోధనపై మరింత అనుభవం

ధర్మసాగర్(వేలేరు): ఉపాధ్యాయులకు తొలిమెట్టు కార్యక్రమం ద్వారానే బోధనపై మరింత అనుభవం వస్తుందని మండల విద్యాశాఖ నోడల్ అధికారి మహేష్ నాయక్, జెడ్పీహెచ్ఎస్ వేలేరు కాంప్లెక్స్ హెచ్ఎం నాగకుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తొలిమెట్టు కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు తొలిమెట్టు శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులలో విద్యాసామర్థ్యాల పెంపుదలకు కృషి చేయాలని సూచించారు. రిసోర్స్ పర్సన్లుగా ప్రవీణ్ కుమార్, సుజాత వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మొగిలిచర్ల శ్రీనివాస్, వెంకటేష్, మండలంలోని పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్ : మాట్లాడుతున్న మహేష్ నాయక్



శాయంపేట : మాట్లాడుతున్న రాధ

శాయంపేట : ఉపాధ్యాయులకు బోధన శిక్షణతోనే అనువభం వస్తుందని జిల్లా అకడమిక్ సీఎంఓ రాధ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు మంచి అనుభవం వస్తుందని, శిక్షణలో నేర్చుకున్న మెళకువలను తరగతి గదులలో ఆచరించారని సూచించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాస్, కోర్సు డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు, ట్రైనింగ్ ఇన్‌చార్జ్ అనురాధ, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం రమాదేవి, ఆర్పీలు సంధ్య, రజిత, సీఆర్పీ అశోక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చేయూత

పరకాల: రోడ్డు ప్రమాదంలో గాయాలై అనారోగ్యం బారిన పడిన పట్టణంలోని రాంనగర్‌కు చెందిన ఎల్కతుర్తి రాజు కుటుంబానికి మున్సిపల్ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి చేయూతనిచ్చారు. గురువారం బాధితుడిని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. బియ్యంతో నిత్యావసర సరుకులు అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, బీజేపీ నాయకులు బలభద్ర రాజు, బాలాజీ మురళి, దాసరి రవి, శివ, కాల నీవాసులు పాల్గొన్నారు.

'భగీరథ' పైపులైన్లకు మరమ్మతు

● 'సాక్షి' కథనానికి స్పందన



శాయంపేట : మండల కేంద్రంలోని శాయంపేట నుంచి పత్తిపాక వెళ్లే రహదారిలో వివిధ గ్రామాలకు వెళ్లే మిషన్ భగీరథ మెయిన్ పైపులైన్ లీకేజీ అయిన విషయం తెలిసిందే. కాగా గురువారం సాక్షిలో ప్రచురితమైన మిషన్ భగీరథ లీకేజీ అనే కథనానికి మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. లీకేజిలకు మరమ్మతులు చేశారు.

స్వచ్ఛ సర్వేక్షన్ బృందం సర్వే

శాయంపేట : మండలంలోని గోవిందాపూర్, నేరేడుపల్లి గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం గురువారం సర్వే నిర్వహించారు. గ్రామాల్లో నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగిస్తున్నారా లేదా అని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సైడ్ డ్రెయినేజీ, పరిసరాల పరిశుభ్రత, ఇంకుడుగుంతలు, సెగ్రిగేషన్ షెడ్లు, తడి, పొడి చెత్త సేకరణ పనితీరును పరిశీలించారు. గ్రామాలకు తనిఖీ బృందం అధికారులు వస్తున్నారని తెలుసుకొని గోవిందాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రక్కన ఇంకుడుగుంత నిర్మించకుండా కంకరపోశారు. సర్వే అధికారులకు అనుమానం వచ్చి తవ్వించారు. దీంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం జీపీలోని రికార్డులు తనిఖీ చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్-23 అవార్డుల ర్యాంకింగ్ కోసం థర్డ్ పార్టీ సర్వే బృందం గ్రామాల్లో పర్యటించినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు.

